ప్రజాశక్తి
మంగళవారం 17 సెప్టెంబర్ 2024
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి





ఫార్మా, సెజ్ కార్మికుల భద్రతకు..

ఘనంగా సిపిఎం రక్షణ యాత్ర ప్రారంభం



సిపిఎం బైకు ర్యాలీలో లోకనాథం, కోటేశ్వరరావు తదితరులు

- తొలి రోజు 70 కిలోమీటర్లు సాగిన బైకు ర్యాలీ
- పాయకరావుపేటలో ప్రారంభం.. అడ్డురోడ్డులో బస
- పరిశ్రమల ప్రమాదాల లోగుట్టును ప్రజలకు తెలియజేసిన నాయకులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఫార్మా, సెజ్ పరిశ్రమల ఉద్యోగులు, కార్మికుల భద్రతకు సిపిఎం చేపట్టిన రక్షణ యాత్ర బైక్ ర్యాలీ తొలి రోజు దిగ్విజయంగా సాగింది. సోమవారం పాయకరావుపేటలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.జగ్గునాయుడు ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. పలు గ్రామాల గుండా సాగిన ఈ బైకు ర్యాలీ ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్‌కు చేరింది. రాత్రి బస అక్కడ చేసి మంగళవారం ఉదయం యలమంచిలి, రాంబిల్లి మండలాల్లో యాత్ర కొనసాగనుంది. పాయకరావుపేట, నక్కపల్లి మండలాల్లో 70 కిలోమీటర్ల మేర 20 గ్రామాల గుండా బైక్ ర్యాలీ వెళ్లింది. పరిశ్రమల్లో ప్రమాదాలకు, కాలుష్య నియంత్రణకు యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో తలెత్తుతున్న ప్రమాదాలు, అనారోగ్య సమస్యలను నాయకులు సభల్లో ప్రజలకు వివరించారు. ఎండ తీవ్రత, ఉక్కబోత ఎక్కువగా వున్నా ర్యాలీ ఉత్తేజంగానే సాగింది. పాయకరావుపేటలో జరిగిన బైక్ ర్యాలీ ప్రారంభ సభలో ర్యాలీకి నేతృత్వం వహించిన సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ పరిశ్రమల కాలుష్యంతో సముద్రంలో మత్స్య సంపద నాశనమవుతోందన్నారు. డెక్కన్ కెమికల్, హెటిరోలో స్థానికులకు ఉద్యోగాలు లభించేలా హోం మంత్రి అనిత ఒత్తిడితేవడం లేదన్నారు. నక్కపల్లి ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటైతే ఈ ప్రాంతం కాలుష్యం బారిన పడుతుందన్నారు. ప్రజల మిగతా 2లో..

వార్త మెయిన్‌లో..



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

త్వరలో విశాఖ రైల్వేజోన్‌కు భూమి పూజ

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- ఘనంగా విశాఖపట్నం - దుర్గ్ వందే భారత్ రైలు ప్రారంభం

ఎంవిపి పోలీసు స్టేషన్‌లో సిపి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం కమిషనరేట్ పరిధిలోని ఎంవిపి పోలీసు స్టేషన్‌ను సోమవారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడారు. పోలీసు అధికారులు, సిబ్బంది ప్రవర్తిస్తున్న తీరును తెలుసుకున్నారు. స్టేషన్ ఆవరణ మొత్తం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. పెండింగ్ కేసులను తక్షణం పరిష్కరించాలని తెలిపారు, అన్ని రిజిస్టర్లు ఎల్లవేళలా అప్డేట్‌గా ఉండాలని ఆదేశించారు. సిబ్బందికి కుటుంబపరంగా, ఉద్యోగపరంగా సమస్యలుంటే తాము ఇచ్చిన 7995095799 నెంబరుకు తెలియ జేయాలన్నారు. పర్యాటక ప్రదేశాలతో పాటుగా తీరప్రాంతం ఎక్కువగా ఉన్న స్టేషన్ పరిధిలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగే పరిస్థితి లేదు
వార్త 2లో..

చురుగ్గా వడ్లపూడి రైల్వే ఫ్లైఓవర్ పనులు
వార్త 4లో..

ఉత్సాహంగా యుటిఎఫ్ క్రికెట్ టోర్నమెంట్
వార్త 4లో..



విశాఖలో భారీ శాంతి ర్యాలీలో పాల్గొన్న ముస్లిములు

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

విశాఖలో భారీ శాంతి ర్యాలీ వార్తలు 7లో..

పోర్టు స్థలాలు లీజుకే..

- లెక్కలు తేల్చేదిశగా యాజమాన్యం
- ప్రజా ప్రతినిధులు ఏం చేస్తున్నారు ?



విశాఖ పోర్టు ఆసుపత్రి (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ పోర్టులో ఉన్నతాధికార యంత్రాంగం కదలికలు చూస్తే పూర్తిగా పోర్టు స్థలాలన్నింటినీ లీజు పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే దిశగానే ఉంటున్నాయి. ఈ మేరకు ఎక్కడెక్కడ తమ స్థలాలున్నాయో లెక్కలు తేల్చే పనిలో ఇప్పుడున్న పోర్టు యాజమాన్యం తలమునకలైనట్టు స్పష్టమవుతోంది. సుమారు 5700 ఎకరాలు పోర్టు చుట్టూరా స్థలాలున్నాయి. నగరంలోని గుండెకాయలాంటి ప్రాంతమైన శాలిగ్రాంపురంలో 17 ఎకరాల పోర్టు భూములను 30 ఏళ్ల పాటు రహేజా ఇనార్బిట్ మాల్‌కు కేవలం రూ.125 కోట్లకు గత ఛైర్మన్ హయాంలో పిపిపిలో ఇచ్చేశారు. తాజాగా పోర్టు స్పోర్ట్స్ కాంప్లెక్స్ (పోర్టు కళావాణి)ని నగరానికి చెందిన ఓ రాజకీయ నాయకునికి లీజు పేరుతో కట్టబెట్టేశారు. రూ.వందల కోట్ల విలువైన 17 ఎకరాలు సహా పోర్టు కళావాణిపై సర్వ హక్కులూ ప్రైవేట్ వ్యక్తులకు ఇప్పటికే దఖలు పడ్డాయి. నగర ప్రజలు, ఆఖరికి పోర్టు సాధారణ ఉద్యోగులు సైతం పోర్టు స్టేడియంలోకి డబ్బులు చెల్లించకుండా అడుగు పెట్టలేని దుస్థితి నెలకొంది. విశాఖ ప్రజలకు చెందాల్సిన భూములను 1933లో పోర్టు స్థాపించబడ్డాక తన ఖాతాలో వేసుకున్న పోర్టు తాజాగా లెక్కలు వేసుకుంటూ అమ్మకాలకు సిద్ధమైపోవడం చూస్తే ఈ ప్రాంత ప్రజల అమాయకత్వాన్ని సొమ్ము చేసుకోవడం మినహా మరొకటి కాదు. ఓడరేవు ప్రభుత్వానికి చెందినది అయినందున ప్రజల నుంచి అభ్యంతరాలుండేవి కావు. అయితే, పోర్టులనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన నాయకులు ప్రైవేట్ వ్యక్తులకు, పిపిపి కింద కట్టబెట్టాలని మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఘనంగా సిపిఎం రక్షణ యాత్ర ప్రారంభం


సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు, యాత్రా బృందం

భద్రతకు చేపడుతున్న యాత్రలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వర రావు మాట్లాడుతూ లాభాలపై పెడుతున్న శ్రద్ధ, కార్మికుల ప్రాణాలపై యాజమాన్యాలు పెట్టడంలేదన్నారు. ప్రమాద నియంత్రణకు యాజ మాన్యాలు ప్రాధాన్యత ఇవ్వక పోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. కార్మికులు, ఉద్యోగులు, ప్రజల ప్రాణాలు కాపాడాలని పరిశ్రమల యాజమాన్యాలు, ప్రభుత్వాలపై ఈ రక్షణ యాత్ర ఒత్తిడి పెంచుతుందన్నారు. చట్ట ప్రకారం కార్మికులు, ఉద్యోగులకు రక్షణ పరికరాలను యాజమాన్యాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఏచూరికి నివాళులు

ఇటీవల మృతిచెందిన పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి బైక్ ర్యాలీకి ముందు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.జగ్గునాయుడు, లోకనాథం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.రాము, గనిశెట్టి సత్యనారాయణ, గంటా శ్రీరామ్, వివి.శ్రీనివాసరావు, అల్లు రాజు, సీనియర్ నాయకులు కర్రి అప్పారావు, నక్కపల్లి మండల కన్వీనర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 20 వరకు జరగనున్న ఈ బైకు ర్యాలీలో లోకనాథం పాటు జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, యలమంచిలి, అచ్యుతాపురం మండలాల సిపిఎం నాయకులు సోమునాయుడు, రమణ, శివాజీ ఉన్న విషయం తెలిసిందే.

నేడు యాత్ర జరిగేదిలా...!

మంగళవారం ఉదయం 8 గంటలకు అడ్డురోడ్‌లో రక్షణ యాత్ర బైక్ ర్యాలీ ప్రారంభంకానుంది. అక్కడ నుంచి దార్లపూడి, ఏటికొప్పాక, పిఎస్ఆర్.పేట, పులపర్తి జంక్షన్, యలమంచిలి, రాంబిల్లి మండలం కొత్తూరు జంక్షన్, మూలజంప, గోకివాడ కొత్తూరు, పెదకలవలపల్లి మీదుగా ఎన్ఎఒబి కాలనీకి చేరనుంది.

పోర్టు స్థలాలు లీజుకే..

చూస్తున్న తరుణంలో ఈ భూములకు రెక్కలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో సిపిఎం, సిఐటియు ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతున్నాయి.

ప్రతిష్టాత్మక పోర్టు ఆసుపత్రికి ఎసరు ?

పోర్టుకుగల వేల ఎకరాల ఆస్తులన్నీ నగరం నడిబొడ్డున, పోర్టు పరిసరాల చుట్టూనే ఉన్నాయి. అలాంటి వాటిలో విశాఖ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి అత్యంత కీలకమైనది. దీన్ని పిపిపి పేరుతో ఆపరేట్ చెయ్యాలని పోర్టు పిపిపి అధికార యంత్రాంగం, యాజమాన్యం నిర్ణయించాయి. ఆ దిశగా తీవ్రస్థాయిలో పావులు కదుపుతున్నారు. ప్రజా ఆందోళనలు వస్తున్నా వీరు వెనక్కి తగ్గడం లేదు.

1984లో 150 పడకల సామర్థ్యంతో దీన్ని నిర్మించారు. ప్రస్తుతం 80 పడకలతో సమర్థవంతంగా పోర్టు అండ్ డాక్ అధికారులకు, ఉద్యోగులకు, కార్మికులకు, రిటైర్డ్ ఉద్యోగులకు, పూల్ కళాశీలకు, కార్గో హ్యాండ్లింగ్ డివిజన్ కార్మికులు, సిఐఎస్ఎఫ్ వాళ్లకు సుమారు 35 వేల కుటుంబాలకు ఉన్న ఫలంగా పోర్టు ఆసుపత్రి వైద్య సేవలందిస్తోంది. పోర్టుకుగల ఆస్తులు లెక్కిస్తే రూ.వేలు, లక్షల కోట్లే బహిరంగ మార్కెట్‌లో ఉంటాయి. మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పేరుతో పోర్టు యాజమాన్యం తాజాగా రూ.250 కోట్లతో పిపిపిలో పెట్టేసే నిర్ణయం చేసేసింది. ఇది భావితరాలకు, పోర్టు ఉద్యోగులు, కార్మికులకు శరాఘాతంగా పరిణమించనుంది. ఆసుపత్రి ప్రారంభంలో ఇప్పుడున్న సిబ్బంది, ఉద్యోగులు, కార్మికులకు సేవలందించే అవకాశాలున్నా క్రమంగా పిపిపి ఆపరేటర్లు కొనసాగించరు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికలు వెళ్లాయి. ఆసుపత్రి కాంప్లెక్స్ ప్రస్తుతం 1.2 ఎకరాల విస్తీర్ణం. ఆసుపత్రి పక్కన మరో ఐదు ఎకరాల వరకూ ఉంది. ఇదంతా ఇచ్చేస్తున్నారు.

ప్రజాప్రతినిధుల సమావేశాల్లో ఏం చర్చించారు?

తాజాగా వైజాగ్ పోర్టుపై గత నెలలో విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పోర్టు అధికారులతో ప్రత్యేక సమావేశమై పోర్టు నుంచి కాలుష్యం తగ్గించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మూడు రోజుల క్రితం విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ కూడా అధికారులతో సమావేశం నిర్వహించి విశాఖ నగరాభివృద్ధికి, అలాగే కాలుష్య రహితంగా మార్చడానికి చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించారు. మరోవైపు పోర్టు వర్గాల్లో 'ఆస్తులన్నీ పిపిపిలో జారిపోతుంటే గంటలు తరబడి అధికారులతో లోపల సమావేశమైన ఇద్దరు నాయకులూ బయటకొచ్చి కాలుష్యం గురించి మీడియా వద్ద ప్రస్తావించడం ఏమిటి?.. పోర్టు ఆస్తులను రక్షించాలి కదా' అంటూ చర్చ సాగుతోంది.

ఫిల్మ్ ఇండస్ట్రీని రాష్ట్రానికి రప్పించేందుకు కృషి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఫిల్మ్ ఇండస్ట్రీని తెలంగాణ నుంచి ఏపికి రప్పించేందుకు కృషి చేస్తామని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. సోమవారం శివాజీపాలెంలోని ఆయన విడిది గృహంలో ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ కంచర్ల అచ్యుతరావు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అచ్యుతరావు ఫిల్మ్ ఇండస్ట్రీ అభివృద్ధి కోసం చేపట్టనున్న కార్యాచరణ ప్రణాళికను వివరించారు. అంతేకాకుండా ఇండస్ట్రీ విశాఖకు తరలి రావడం వల్ల ఎన్నో వందల కుటుంబాలకు ఉపాధి దక్కుతుందన్నారు. దీనిపై కేంద్ర మంత్రి స్పందిస్తూ సినిమా పరిశ్రమ రాష్ట్రానికి రావడం ద్వారా ఎన్నో ప్రభుత్వ కార్యాలయాలు కూడా ఇక్కడికి రావడానికి అవకాశాలు ఉంటాయన్నారు. 24 క్రాఫ్ట్సకు సంబంధించిన సిబ్బంది, 64 కళల కళాకారులకు కూడా ఉపాధి లభించనుందన్నారు. ఈ విషయాన్ని భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ మంత్రితో చర్చిస్తానన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగే పరిస్థితి లేదు

◆ కూటమి ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించాలి ◆ వైసిపి రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగే పరిస్థితిలో లేదని వైసిపి రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు అన్నారు. సోమవారం ఉదయం హెచ్‌బి.కాలనీ సమీపంలోని డాక్టర్స్ కాలనీ వద్దనున్న ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తుపై మూడు, నాలుగు ఏళ్లుగా ఎన్నో వదంతులు వినిపిస్తున్నాయని, ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, విశాఖ ప్రజల మనోభావాలను నిలబెడతామని ఎన్నో ప్రగల్భాలు పలికారని, కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని తెలిపారు. ఆగస్టు 8వ తేదీన పార్లమెంట్ వేదికగా తాను అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఈ నెల 10వ తేదీన తనకు లిఖిత పూర్వక సమాధానమిచ్చారని, అది తనకు రెండు రోజుల క్రితం అందిందని బాబూరావు తెలిపారు. ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆర్ఐఎన్ఎల్ (స్టీల్‌ప్లాంట్)లో భారత ప్రభుత్వ వాటాలను వంద శాతం ఉపసంహరించేందుకు ఆమోదం తెలిపినట్టు ఆ లేఖలో పేర్కొన్నారన్నారు. విశాఖ ఉక్కు ఎందరో మహానుభావుల త్యాగాలతో ఏర్పడిందని, ఈ పరిశ్రమపై ఎన్నో కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, తక్షణం కూటమి నేతలైన చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లు తమ స్టాండ్ ఏమిటో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీ భరత్ ఉక్కు పరిరక్షణ దీక్షా శిబిరం వద్దకు వెళ్లి ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, అవసరమైతే రాజీనామాలు చేస్తామని చెప్పారని, వాస్తవ పరిస్థితి దానికి భిన్నంగా ఉందని అన్నారు. వారు రాజీనామాలు చేయాల్సిన అవసరం లేదని, వారి పార్టీ నుంచి కేంద్రానికి ఇస్తున్న మద్దతును ఉపసంహరించుకుంటే సరిపోతుందని బాబూరావు సూచించారు. ప్లాంట్ పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని, రెండు, మూడు రోజుల్లో కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరానికి వెళ్లి తనకు అందిన లేఖపై పోరాట కమిటీ నాయకులతో చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ వివరాలను కూడా తెలియ జేస్తానన్నారు. మీడియా సమావేశంలో వైసిపి నాయకులు ద్రోణంరాజు శ్రీ వాత్సవ్, తదితరులు పాల్గొన్నారు.


తనకు అందిన లేఖను చూపుతున్న ఎంపీ గొల్ల బాబూరావు

పోర్టు ఆసుపత్రిని ప్రయివేటుకు ఇవ్వొద్దు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శాలిగ్రాంపురంలో 1984లో ప్రారంభించిన పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను ప్రయివేటుకు ఇవ్వొద్దని, పోర్టు సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని డబ్ల్యుటిడబ్ల్యుఎఫ్ఐ (సిఐటియు) కార్యదర్శి బి.జగన్, యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.రామలింగేశ్వరరావు, విడిఎల్‌బి అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కాన సత్యనారాయణ, బి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. సోమవారం జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 150 పడకల సామర్థ్యంతో నిర్మించిన ఆసుపత్రి ప్రస్తుతం 80 పడకలతో సమర్థవంతంగా పోర్టు, డాక్ అధికారులకు, ఉద్యోగులకు, కార్మికులకు, రిటైర్డ్ కార్మికులకు, ఫ్యామిలీ పెన్షనర్లకు, పూల్ కళాశీలకు, సిహెచ్‌డి క్యాజువల్ కార్మికులకు, సిఐఎస్ఎఫ్ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు దశాబ్దాల తరబడి సేవలందిస్తోందన్నారు. 35 వేల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని తెలిపారు. అటువంటి పోర్టు హాస్పిటల్‌ను పిపిపి పద్ధతిలో మల్టీ డిసిప్లైనరీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా 300 పడకలతో ప్రైవేటు వారికి ఇచ్చేయాలని నిర్ణయం చేయడం దుర్మార్గమన్నారు. దీన్ని సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇదే గనుక అమలయితే పోర్టు, డాక్ కార్మికులు, ఉద్యోగుల కుటుంబాల ఆరోగ్య భద్రతను ప్రైవేటు వారి చేతుల్లో పెట్టడమే అవుతుందన్నారు. పోర్టుల్లో పిపిపి, బిఒటి విధానాలు విఫలమయ్యాయని గతంలో స్వయంగా కాగ్ మొట్టికాయలు వేసిన విషయాన్ని వారు గుర్తుచేశారు. ఉద్యోగులు, కార్మికులు పొందే వైద్యానికి లాభనష్టాలు బేరీజు వేయడం దుర్మార్గమన్నారు. పోర్టుల హాస్పిటల్స్ విషయమై ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు అన్ని ఫెడరేషన్ల అభిప్రాయాలు తీసుకునే ముందుకు వెళ్తామని గతంలో హామీ ఇచ్చిన ఐపిఎ మాట తప్పిందని విమర్శించారు. పోర్టులోనున్న కార్మిక సంఘాలన్నీ పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటీకరించొద్దని స్పష్టంగా చెప్పాయన్నారు. ఎపి హైకోర్టు కూడా హాస్పిటల్ విషయమై కార్మిక సంఘాల అభిప్రాయాలను తీసుకోవాలని చెప్పిందని గుర్తు చేశారు. అయినప్పటికీ గోల్డెన్ జూబ్లీ హాస్పటల్‌ను ప్రైవేటుకు ఇవ్వడానికి యాజమాన్యం, ప్రభుత్వం ముందుకెళ్లడం చూస్తే ఎంత అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నాయో ఇట్టే తెలుస్తోందని విమర్శించారు. విశాఖ పోర్టు ఆసుపత్రిని పిపిపికి ఇవ్వాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వేలాది సంతకాల సేకరణను సోమవారం నుంచే విశాఖపట్నం పోర్టు ఛైర్మన్‌కు, ట్రాన్స్‌పోర్టు సెక్రటరీ (న్యూఢిల్లీ)కి అందిస్తామన్నారు. ఈ నెల 19న నల్ల బ్యాడ్జీలతో నిరసన, 24న పోర్టు ఎఒబి వద్ద ధర్నా నిర్వహిస్తామని, అనంతరం పోర్టు హాస్పిటల్ వద్ద వేలాది మందితో అక్టోబర్ 1 నుంచి నిరవధిక దీక్షలు చేపడతామని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాలను కార్మికులు, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే మా విధానం, నినాదం

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



మీడియాతో మాట్లాడుతున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విశాఖపట్నం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటు పరం కాకుండా చూడడమే టిడిపి విధానమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. వాజ్‌పేయ్ ప్రధానిగా ఉన్నప్పుడు పెట్టుబడుల ఉపసంహరణ ప్రతిపాదన ఆగినా, ప్రయివేటీకరణ జరగబోదని స్టీల్ మంత్రి కుమారస్వామి విశాఖలో ప్రకటించినా అది టిడిపి వల్లే సాధ్యపడిందనేది తెలుసుకోవాలని హితవు పలికారు. సోమవారం సింహాచలం పవిత్రోత్సవాల్లో పాల్గొన్న ఆయన తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ ఒక పరిశ్రమ కాదని, తెలుగు ప్రజల ఆత్మ గౌరవం, గుండె చప్పుడని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం ఎమ్మెల్యేగా తాను చేసిన రాజీనామాపై 3 సంవత్సరాల పాటు తాత్సారం చేసి ఎటూ తేల్చకుండా ఎమ్మెల్సీ ఎన్నికల సమయానికి ఆమోదించి వైసిపి రాజకీయం చేసిందని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యే ఓటుకు ఉండే ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని రాజీనామా విషయమై కోర్టుకు వెళ్లానే తప్ప, కేవలం రెండు నెలల గడువున్న పదవి కోసం కాదని తెలుసుకోవాలన్నారు. టిడిపి పోటీ పెట్టకపోవడం వల్ల ఎమ్మెల్సీగా గెలిచిన నాయకుడు, మంత్రిగా ఉంటూ రాష్ట్రంలో అత్యధిక ఓట్ల తేడాతో ఓడిపోయిన కొడికి గుడ్డుకు తేడా తెలీని మరో వైసిపి నాయకుడు ఈ అంశంపై చవకబారు విమర్శలు మానుకోవాలని సూచించారు. వైసిపి దిగజారుడు రాజకీయాలు మానుకోకపోతే ఇప్పుడు వచ్చిన 11 స్థానాలూ పోయి గుండు సున్నా మాత్రమే మిగులుతుందని హెచ్చరించారు.

ముచ్చర్లలో వైద్యశిబిరం

గ్రామాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారి జగదీశ్వరరావు

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం ముచ్చర్ల గ్రామంలో సోమవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. గ్రామంలో డెంగీ, డయేరియాతో పలువురు బాధపడుతున్న విషయం పత్రికల్లో రావడంతో జిల్లా వైద్యాధికారి జగదీశ్వరరావు, శొంఠ్యాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పద్మ, రమేష్, సిబ్బంది గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. గ్రామంలో పర్యటించి పారిశుధ్యం, తాగునీటిని పరిశీలించారు. నీటి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఈ నెల11, 14 తేదీల్లో అన్న సంతర్పణలో ఆహారం తీసుకున్న కారణంగా ఈ వ్యాధులు వచ్చాయా అన్నది పరిశీలిస్తున్నారు. తగరపువలస ఎన్నారై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను వైద్యాధికారి డాక్టర్ రమేష్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ పరమేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ ఈశ్వరరావు, ఎఎన్ఎం రాములమ్మ, ఆశ కార్యకర్త సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న డిఎం అండ్ హెచ్ఒ జగదీశ్వరరావు

కార్నియా మార్పిడిలో ఎల్‌విపిఇఐ రికార్డు


డాక్టర్ జిఎన్ రావు

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రపంచంలో ఏ సంస్థ కూడా సాధించని విధంగా అత్యధిక కార్నియా మార్పిడిలు చేసిన ఘనత ఎల్‌విపిఇఐలోని శాంతిలాల్ సంఘ్వీ కార్నియా ఇన్‌స్టిట్యూట్ సాధించిందని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గుళ్లపల్లి ఎన్.రావు తెలిపారు. 1987లో స్థాపించినప్పటి నుంచి ఎల్‌విపిఇఐ 50 వేలకు పైగా కార్నియా మార్పిడిలు చేసిందని పేర్కొన్నారు. రోగులు తమపై ఉంచిన విశ్వాసం వల్ల ఈ బృహత్తర విజయం సాధ్యమైనట్లు తెలిపారు. దీంతో పాటు శోక సమయంలో కార్నియా దాతల కుటుంబాలు చూపిన ఉదారత వల్ల మాత్రమే సాధ్యమైనట్లు పేర్కొన్నారు. హైదరాబాద్, విశాఖపట్నం, భువనేశ్వర్, విజయవాడ నేత్ర నిధుల ద్వారా అత్యధికంగా కార్నియాలను సేకరించినట్లు తెలిపారు. వీటి ద్వారా ఏటా 12 వేలకు పైగా నేత్రదానాలను అందుకున్నట్లు తెలిపారు. వీటి ఫలితంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో కార్నియా మార్పిడి కోసం వెయిటింగ్ లిస్ట్ లేదని పేర్కొన్నారు. ఇంతటి విజయానికి డాక్టర్ జిఎన్.రావు దృఢ సంకల్పం, ప్రతిభా పాటవాలు ఎంతో దోహదపడ్డాయని ఎల్‌విపిఇఐ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులు డాక్టర్ శాంత్ గర్గ్ తెలిపారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పద్మనాభం మండలం, చిన్నాపురం ఎంపిపి పాఠశాల విశ్రాంత హెచ్ఎం ఎన్.నారాయణరావు సోమవారం కుర్చీలు అందజేశారు. తాను అడిగిన వెంటనే స్పందించి కుర్చీలు అందజేయడంపై ప్రధానోపాధ్యాయులు రమణ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల శత వసంతాల వేడుకల నిర్వహణ కమిటీ అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు కె.ముత్యాలరావు, సహాయ కార్యదర్శి చౌదరి సత్యరాజు, కోశాధికారి పూసర్ల శ్రీనివాస్, రాజేటి బసవకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు పాఠశాల శత వసంతాల వేడుకల నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించారు. వందేళ్ల వేడుకలకు సంబంధించి ఓ డాక్యుమెంటరీ లా సావనీర్‌ను రూపొందిస్తే ఉపయోగంగా ఉంటుందని రచయిత పి.రాజేంద్రప్రసాద్ వర్మ సూచించారు. ఈ సమావేశంలో కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


కుర్చీలు అందజేస్తున్న విశ్రాంత హెచ్ఎం నారాయణరావు

గిరిజన శిక్షణ సంస్థ విద్యార్థికి మెడికల్ సీటు


గోపాలరావు

ప్రజాశక్తి -మధురవాడ : మారికవలసలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణ సంస్థలో శిక్షణ పొందుతున్న విద్యార్థులలో జి.గోపాలరావు 482 నీట్ స్కోర్, ఆలిండియా ర్యాంకు 3,686 (ఎస్‌టి కేటగిరిలో) సాధించినట్లు శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ శివప్రసాద్ తెలిపారు. ఎంబిబిఎస్ -2024 కౌన్సెలింగ్‌లో విశాఖలోని గాయత్రీ విద్యా పరిషద్ మెడికల్ కళాశాలలో సీటు పొందారని పేర్కొన్నారు. హుకుంపేట మండలం ఈదుల గరువు గ్రామానికి చెందిన జి.ప్రసాదరావు, లేటు లక్ష్మీల కుమారుడు. అతి సాధారణమైన వ్యవసాయ కూలీల కుటుంబం నుంచి వచ్చాడు. నీట్ పరీక్షల్లో మంచి ర్యాంకును సాధించిన విద్యార్థిని అల్లూరి జిల్లా కలెక్టర్, ప్రాజెక్టు అధికారి అభినందించారు.

విశాఖ నార్త్ ఎసిపిగా అప్పలరాజు

ప్రజాశక్తి -మధురవాడ : నార్త్ సబ్ డివిజన్ ఎసిపిగా ఎన్.అప్పలరాజు నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా డిఎస్‌పిలకు బదిలీలు కాగా, వెయిటింగ్‌లో ఉన్న అప్పలరాజును విశాఖ ఉత్తర సబ్ డివిజన్‌కు కేటాయించారు. ఆయన గతంలో విశాఖలోని పలు స్టేషన్లలో సిఐగా విధులు నిర్వహించారు. ఇంటిలిజెన్స్, అనకాపల్లి డిఎస్‌పిగా కూడా విధులు నిర్వహించారు. ఇక్కడ పనిచేసిన సునీల్ ఇటీవల రాష్ట్ర కార్యాలయానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో అప్పలరాజు బాధ్యతలు చేపట్టనున్నారు.

క్రీడల్లో కెజిబివి విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి -భీమునిపట్నం : కర్నూలు జిల్లా డిఎస్ఎ అవుట్ డోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన 9వ రాష్ట్ర స్థాయి "ఆటియా-పాటియా" క్రీడా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు స్థానిక కెజిబివి ప్రిన్సిపల్ గంగాకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17 ఏళ్ల లోపు బాలురు, బాలికలకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 9, 10, ఇంటర్ విద్యార్థినులు ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు, పిఇటి వరలక్ష్మిని డిఇఒ ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష ఎపిసి బి.శ్రీనివాసరావు, జిసిడిఒ డాక్టర్ కలేషా బేగంతో పాటు ప్రిన్సిపల్ గంగాకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

నేరాలు ఘోరాలు

ద్విచక్ర వాహనం దగ్ధం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం ఫ్లైఓవర్ వద్ద సోమవారం ఉదయం పల్సర్ ద్విచక్రవాహనం దగ్ధమైంది. యువకుడు నవీన్ విశాఖ నుంచి సాలూరుకు ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఫ్లైఓవర్ వద్ద ఆకస్మికంగా వాహనం నుంచి మంటలు వ్యాపించాయి. వెంటనే నవీన్ వాహనాన్ని నిలిపివేశాడు. స్థానికుల పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు.

ప్రమాదాలకు నిలయం

- విద్యుత్ వైర్లుకు పెనవేసుకున్న తీగలు

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం పందలపాక తర్లువాడ గ్రామానికి వెళ్లే రహదారిలో విద్యుత్ వైర్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. చెట్లకు విద్యుత్ వైర్లు పెనవేసుకొని ఉండడంతో ఎప్పుడు ఎలా ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో విద్యుత్ వైర్లు చెట్లు తీగలతో పెనవేసుకోవడంతో మంటలు చెలరేగి షార్ట్ సర్క్యూట్ అవుతుందని భయపడుతున్నారు. విద్యుత్ లైన్లకు పచ్చని తీగలు కలిసి మంటలు రావడంతో చెట్లు కాలిపోతున్నాయి. ప్రమాదాలు జరగకముందే విద్యుత్ వైర్లను అల్లుకున్న తీగలను వేరుచేయాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.


పందలపాక - తర్లువాడ మధ్యలో విద్యుత్ వైర్లుకు పెనవేసుకున్న తీగలు

ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో సోమవారం ప్రపంచ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపల్ ఎం.జ్యోతికుమారి మాట్లాడుతూ, సుఖవంతమైన లైఫ్ స్టైల్ కోసం వినియోగించే అనేక సౌకర్యాలు పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైస్ ప్రిన్సిపల్ యు.మాణిక్యంనాయుడు మాట్లాడుతూ, ఓజోన్ పొర చిల్లులు పడితే ఏర్పడే అతినీల లోహిత సూర్య కిరణాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. భూగోళాన్ని ఓజోన్ పొర రక్షించే విధానాన్ని ఛాత్రోపాధ్యాయులు గొడుగుల ద్వారా ప్రదర్శించారు. ఓజోన్, పర్యావరణ అంశంపై ఛాత్రోపాధ్యాయులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎల్.సుధాకర్, జిజిఎస్.నాగేశ్వరరావు, గొట్టేటి రవి, సిఎ సోమయాజులు, ఎన్.త్రినాథరావు, ఎం.మహాలక్ష్మి, ఆర్.నీలిమ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేష్, ఆదిత్యలకు సన్మానం

ప్రజాశక్తి -భీమునిపట్నం : "మిషన్ గ్రీన్ భీమిలి" పేరిట పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తున్న భీమిలికి చెందిన జి.వెంకటేష్, ఎం.ఆదిత్యను సోమవారం స్థానికంగా ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి సంస్థ ప్రతినిధులు సోమవారం సన్మానించారు. సన్ స్కూల్, విద్యా సాగర పబ్లిక్ స్కూల్ విద్యార్థులు తయారుచేసిన విత్తన బంతులను స్థానిక కొండపై చల్లడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు వీరు ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కాళ్ల సన్నీ, ఎం.సూర్యశ్రీనివాస్, కె.అశోక్, పి.దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస - చిల్లపేట చెరువుకు ఆనుకుని ఉన్న ఆక్రమణలను తొలగించాలని జనసేన జివిఎంసి రెండో వార్డు అధ్యక్షులు నీలాపు శంకరరెడ్డి డిమాండ్ చేశారు. సంబంధిత చెరువును సోమవారం ఆయన పరిశీలించారు. ఆక్రమణలో భాగంగా చెరువుకు ఉండే పలు మదుములు కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం మూసివేశారని, దీంతో వివిధ ప్రాంతాల నుంచి వాడుక నీరు, వర్షపు నీరు ఇదే చెరువులో చేరి నిల్వ ఉంటోందని పేర్కొన్నారు. తద్వారా చెరువు నుంచి దుర్వాసన వస్తుందన్నారు. జివిఎంసి, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి చెరువు విస్తీర్ణంపై స్పష్టత ఇవ్వాలని, సమగ్రంగా సర్వే చేయాలని కోరారు.

చురుగ్గా వడ్లపూడి రైల్వే ఫ్లైఓవర్ పనులు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్ నుంచి వడ్లపూడికి వెళ్లే రహదారిలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పది రోజులుగా చురుగ్గా సాగుతున్నాయి. పనులు చేసేవారు, ఇంజినీర్లు ఉండేందుకు షెడ్లు నిర్మాణం చేపట్టారు. రోడ్లు భవనాల శాఖ నిధులు కేటాయించకపోవడంతో కొన్ని సంవత్సరాల పాటు పనులు ఆలస్యమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం సేతు బంద్ పథకం కింద రూ.2 కోట్లు కేటాయించింది. అప్పట్లో పనులు చేపట్టే సమయంలో ఎలక్ట్రికల్ లైన్ అడ్డు రావడంతో మరలా సంవత్సరం పాటు పనులు ఆగిపోయాయి. ఆటంకాలన్నీ తొలగిపోవడంతో పది రోజులుగా పనులు చేస్తున్నారు. ఈ వంతెన పూర్తి స్థాయిలో వినియోగంలోకి వస్తే అనకాపల్లి నుంచి వచ్చే ప్రజలు అగనంపూడి దగ్గర తిరిగి గాజువాక ఆటోనగర్ జాతీయ రహదారికి చేరుకొవచ్చు. దీని వల్ల సమయం చాలా ఆదా అవుతుంది. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగస్తులు కూడా ఉపయోగపడుతుంది. వడ్లపూడి, కూర్మన్నపాలెం, రాజీవ్‌నగర్, దువ్వాడ తదితర ప్రాంత ప్రజలు నగరానికి వెళ్లేందుకు ఈ రహదారి ఉపయోగపడుతుంది. ఆటోనగర్‌లో ఉన్న పరిశ్రమ యజమానులకు కూడా ఉపయోగకరంగా ఉండబోతుంది.



పనుల కోసం ముందుగా నిర్మిస్తున్న భవనాలు



దీక్షలో కూర్చున్న పోరాట కమిటీ నాయకులు

విశాఖ ఉక్కును దోచుకునే హక్కు లేదు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, త్యాగాల పునాదుల మీద ఏర్పాటైన ఉక్కును దోచుకునే హక్కు కేంద్రానికి లేదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 1313వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఎఐటియుసి నాయకులు, కార్యకర్తలు కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి ఆదినారాయణ మాట్లాడుతూ, ఉక్కు రిలే దీక్షలు ప్రారంభమై 1313 రోజులైనప్పటికీ కేంద్రంలో చలనం లేదన్నారు. ఉక్కును కాపాడు కోవడం కోసం ఎలాంటి పోరటానికైనా సిద్ధమన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షల్లో నాయకులు మసేన్‌రావు, డొక్కా నర్సింగరావు, కె.రాజబాబు, సాంబశివ, జి.రాజు, డేవిడ్, సలాది శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పోతిన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అఖిలపక్ష నాయకులు

పలుచోట్ల పోతిన సన్యాసిరావు వర్ధంతి

ప్రజాశక్తి -యంత్రాంగం

కమ్యూనిస్టు పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు పోతిన సన్యాసిరావు వర్ధంతిని సోమవారం పలుచోట్ల నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గాజువాక : పెదగంట్యాడ సిపిఐ కార్యాలయంలో పోతిన సన్యాసిరావు 40వ వర్ధంతిని జి.ఆనంద్ అధ్యక్షతన నిర్వహించారు. సన్యాసిరావు చిత్రపటానికి సిపిఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, నాయకులు పల్లెటి పోలయ్య, కె.అచ్యుతరావు, ఎల్లేటి శ్రీనివాస్, కె.రాజబాబు, కె.పోతన్న, పి.దుర్గారావు, సోమేష్, శివ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

మధురవాడ : మధురవాడలో సిపిఐ, క్వారీ సొసైటీ ఆధ్వర్యాన పోతిన సన్యాసిరావు వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎండాడ, మధురవాడ మాజీ సర్పంచులు చెన్నా దాసు, కుడితి రామారావు, అఖిలపక్ష పార్టీల నాయకులు పోతిన శ్రీనివాసరావు, మొల్లి లక్ష్మణరావు, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, వాండ్రాసి అప్పలరాజు, పిళ్లా సూరిబాబు, నాగోతి సత్యనారాయణ, డి.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యుటిఎఫ్ క్రికెట్ టోర్నమెంట్



యుటిఎఫ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న అజశర్మ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) స్వర్ణోత్సవ సంబరాలలో భాగంగా విశాఖపట్నం జిల్లా యుటిఎఫ్ ఆధ్వర్యాన సోమవారం ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ క్రికెట్ స్టేడియంలో జిల్లాలోని ఉపాధ్యాయులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటువంటి క్రీడా పోటీలు ఉపాధ్యాయుల మధ్య సుహృద్భావ వాతావరణాన్ని పెంపొందిస్తాయన్నారు. ఉపాధ్యాయుల మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. భవిష్యత్‌లో జరిగే కీడలలో ఉపాధ్యాయులతో పాటు ఇతర శాఖల ఉద్యోగులను, కార్మికులను కూడా భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.నాగేశ్వరరావు, సహధ్యక్షులు ప్రభాకరరావు, జిల్లా ప్రధానకార్యదర్శి టిఆర్.అంబేద్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తరన అప్పారావు, జిల్లా కార్యదర్శులు రావు, ఉప్పాడ రాము, మహమ్మద్ రిజ్వాన్, రియాజ్ అహ్మద్, తాటికొండ జగన్ పాల్గొన్నారు. విశాఖ జిల్లాలోని 11 మండలాలకు చెందిన ఉపాధ్యాయ క్రీడాకారులు పాల్గొన్నారు.



పోటీలకు హాజరైన ఉపాధ్యాయ క్రీడాకారులు

బోటు యజమానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సముద్రంలో వేట చేస్తున్న వాసుపల్లి అప్పయ్యమ్మకు చెందిన మెకనైజ్డ్ బోటు ఆదివారం అగ్ని ప్రమాదానికి గురై దగ్ధమైన సంగతి తెలుసుకొని, సోమవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ బాధితుల ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిందని, బోటులో వేటకు వెళ్లిన ఐదుగురు మత్స్యకారులు సముద్రంలో దూకి సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారని, ప్రమాదంలో సుమారు రూ. 35 లక్షలు నష్టం జరిగిందని బోటు యజమాని వాసుపల్లి అప్పయ్యమ్మ ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ అధికారులతో మాట్లాడి నష్టపరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా తనవంతుగా కూడా బాధితులకు సహాయం చేస్తాన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -గోపాలపట్నం : మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో స్థానిక లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో సిఐటియు, అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు, గర్భిణులకు కేన్సర్ నిరోధక వైద్య పరీక్షలు, ఈసీజీ, రక్త పరీక్షలు చేశారు. సుమారు 200 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనగర్ నాయకులు పి.మాణిక్యం, కర్మిజ్జి రమణ, గాడు వెంకటలక్ష్మి, ఐద్వా, సిఐటియు నాయకులు ముద్దాడ వరప్రసాద్, పి.అనసూయ, సిపిఎం నాయకులు బలివాడి వెంకట్రావు, ప్రజావేదిక నాయకులు కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచితంగా అందని ఇసుక



ఎన్ఎడి వద్ద ధర్నా నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : విశాఖ జిల్లాలో భవన నిర్మాణదారులకు ఎక్కడా ఇసుక ఉచితంగా అందటం లేదని విశాఖ జిల్లా భవన నిర్మాణ సంఘం అధ్యక్షులు పి.అనసూయ విమర్శించారు. ఈ మేరకు ఎన్ఎడి కొత్త రోడ్డు జంక్షన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇసుక ధర టన్నుకు రూ.వెయ్యి అని చెప్పి నేడు టన్ను ఇసుక ధర రూ.2000కు విక్రయించడం దారుణం అన్నారు. దీనివల్ల నిర్మాణదారులు ఎవరూ ఇసుకను కొనుగోలు చేయకపోవడంతో, భవన నిర్మాణ కార్మికులకు పనిలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ సంఘం గౌరవాధ్యక్షులు బలివాడ వెంకటరావు మాట్లాడుతూ, ఉచిత ఇసుక విధానం విశాఖ జిల్లాలో అమలు కావడం లేదన్నారు. సిమెంట్ బస్తా ధర రూ.370 ఉంటే, ఇసుక ధర బహిరంగ మార్కెట్లో బస్తా ఇసుక రూ.350 పలుకుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పనిచేయిస్తామని కార్మిక మంత్రి ఇచ్చిన తొలి సంతకం హామీ హామీగానే మిగిలిపోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రల్ల మల్లేష్, ఆర్ బాలయ్య, కార్మికులు పాల్గొన్నారు.

వైజాగ్‌కు సినిమా పరిశ్రమ : వంశీకృష్ణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం చిన్న సినిమాలకు హబ్‌గా మారుతుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సినీ పరిశ్రమ విశాఖకు వస్తుందని, ఆ దిశగా తాము ప్రయత్నం చేస్తామని చెప్పారు. సోమవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన మీడియా సమావేశంలో మన్యం ధీరుడు సినిమా ట్రైలర్‌ను ఆయన విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ, ట్రైలర్ అద్భుతంగా ఉందన్నారు. వైజాగ్ చిన్న సినిమాలకు హబ్‌గా మారబోతుందన్నారు. సినిమా పరిశ్రమ విశాఖ రావడానికి కృషి చేస్తానన్నారు. సినిమా నిర్మాణంతో పాటు అల్లూరి సీతారామరాజు పాత్ర వహించి తీయడం సాహసమే అన్నారు. ఖచ్చితంగా ఈ సినిమాను అందరూ ఆదరించాలన్నారు. మరిన్ని మంచి సినిమాలు సత్యనారాయణ నిర్దేశకత్వంలో రావాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆకాంక్షించారు.

నిర్మాత, అల్లూరి సీతారామరాజు పాత్ర ధారి ఆర్‌వివి.సత్యనారాయణ మాట్లాడుతూ ఇష్టపడి ఈ సినిమా తీశానన్నారు. ఇందులో రెండు పాటలు కూడా తాను పాడానని తెలిపారు. హీరో కృష్ణ సినిమా తీసిన 50 ఏళ్ల తరువాత టెక్నాలజీతో పాటు సహజత్వానికి ప్రాధాన్యత ఇచ్చి షూటింగ్ చేశానన్నారు. తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ మాట్లాడుతూ, యువతరానికి అల్లూరి సీతారామరాజు స్ఫూర్తి ప్రదాత అని, అటువంటి మహోన్నత మన్యం వీరునిపై సినిమా తీయడం అభినందించదగ్గ విషయం అన్నారు. రంగ సాయి నాటక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బాదంగీర్ సాయి, కోరుకొండ రంగారావు తదితరులు పాల్గొన్నారు.



మన్యం ధీరుడు సినిమా ట్రైలర్‌ను విడుదలచేస్తున్న వంశీకృష్ణ

పోరాట యోధుడు సీతారాం ఏచూరి

సంతాప సభల్లో వక్తలు



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లక్ష్మణమూర్తి తదితరులు

ప్రజాశక్తి-యంత్రాంగం

పోరాటాల యోధుడు సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అని వక్తలు పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల సోమవారం పలుచోట్ల సంతాప సభలు నిర్వహించారు. సీతారం ఏచూరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ములగాడ : జివిఎంసి 58, 59, 60 వార్డుల ఆఫీసు వద్ద సీతారాం ఏచూరి చిత్రపటానికి సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనలో మనమంతా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ అధ్యక్షులు కె.పెంటారావు, జివిఎంసి జోన్ నాయకులు కె.రమణ, బి.రాంబాబు, సూరిబాబు, రాము, రైల్ బాబు, తిరుపతిరావు, ఆదినారాయణ, రాజు, రవణమ్మ, సిహెచ్.లక్ష్మి, పద్మ, ఎస్.లక్ష్మి, జివిఎంసి సిబ్బంది త్రినాధ్, ఆదినారాయణ పైడిరాజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : పౌర గ్రంథాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి కనకదుర్గ ఆటో స్టాండ్ సభ్యులు కృష్ణయ్య, గుడివాడ అప్పారావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కనకదుర్గ ఆటో స్టాండ్ ప్రెసిడెంట్ బాబ్జి, సిపిఎం నాయకులు ప్రకాష్, స్వతంత్ర కుమార్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

అరిలోవ : ఆరిలోవ సిపిఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం ఆరిలోవ కార్యదర్శి నరేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం విశాఖ జిల్లా కమిటీ సభ్యులు పి.మణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.శంకర్, సత్యనారాయణ, రంగమ్మ, నాగరాజు, భూలోకరావు, చంటి, కాంతం, సిపిఎం కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అనకాపల్లి : మార్క్సిస్టు మేధావి, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ సోమవారం అనకాపల్లి గవరపాలెంలో జరిగింది. ఏచూరి చిత్రపటానికి సిపిఎం, రైతు సంఘం నాయకులు తేలయ్యబాబు పూల మాల వేసిన శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్ శంకర్రావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి నిర్మాణ దక్షుడని తెలిపారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఏచూరి ఆశయాలకు కట్టుబడి ముందుకు వెళ్లాలని ఉద్బోధించారు. కొణతాల త్రినాథ్ మాట్లాడుతూ ఏచూరి తన మేధో సంపత్తిని ప్రజలకు ఉపయోగపడేలా పనిచేశారన్నారు. అడ్వకేట్ సాయి మాట్లాడుతూ ఏచూరి దేశంలోని మేధావులందరినీ కూడా ప్రభావితం చేశారన్నారు. కార్యక్రమంలో పెంటకోట శ్రీనివాసరావు, కొణతాల కృష్ణ అప్పారావు, భీశెట్టి సుబ్బారావు, బొడ్డేడ వెంకట అప్పారావు, కర్రి గంగాధర్, మల్లికార్జున్, పాల్గొన్నారు. సీతారాం ఏచూరిపై గాయని లీలావతి పాట రచించి ఆలపించారు.



అరిలోవలో నివాళులర్పిస్తున్న మణి, చంటి, శంకరరావు తదితరులు

షిప్ యార్డ్‌ను డిఫెన్స్‌లో విలీనం చేసిన ఘనత సీతారాం ఏచూరిదే..

ఎంవిపి.కాలనీ : హిందుస్థాన్ షిప్ యార్డును డిఫెన్స్‌లో విలీనం చేసిన ఘనత సీతారాం ఏచూరిదేనని సిఐటియు షిప్‌యార్డు విభాగం ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రసాద్ అన్నారు. షిప్ యార్డ్ సిఐటియు కార్యాలయంలో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ దేశం ఒక పోరాట యోధున్ని కోల్పోయిందన్నారు. ఆయన గొప్ప ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞుడు, మేధావి అని కొనియాడారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ కార్యదర్శి మూర్తి, అధ్యక్షులు బోస్, సిఐటియు నాయకులు బిఎస్ఎన్.రాజు, టిఎన్‌టియుసి కార్యదర్శి రాము, బిఎంఎస్ అధ్యక్షులు సింహాచలం, టిఎన్ఇటియు అధ్యక్షులు గున్నయ్య, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు అనిల్, అప్పలకొండ, బిసి అసోసియేషన్ అధ్యక్షులు ధనుంజయ, జానకిరామ్, విక్టరీ ప్రసాద్, సత్యనారాయణ, ప్రవీణ్ కుమార్, పి.ప్రసాద్, రామచంద్రరావు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఆటోస్టాండ్, సిపిఎం నాయకులు



అనకాపల్లిలో నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు, స్థానిక నాయకులు

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ వెరిఫికేషన్ పునఃప్రారంభం

ప్రజాశక్తి - అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో అకాల వర్షాల కారణంగా రద్దయిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ వెరిఫికేషన్‌ను తిరిగి ప్రారంభిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులకు 15 వేల రూపాయల పెన్షన్‌కి అర్హులను గుర్తించుటకు ఈ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే అన్నారు. గమనిక ఈ మెడికల్ క్యాంపుకు హాజరయ్యే దివ్యాంగులకు. 6000 రూపాయలు పెన్షన్ వస్తున్నవారు సదరం సర్టిఫికెట్‌లో 80 శాతం అంగవైకల్యం కలిగి, రెండు కాళ్లు చచ్చుపడి నడవలేని వారు, మంచం మీదే ఉన్నవారు, వీల్ చైర్ పైన వెళ్లేవారు, క్రిటికల్‌గా ఉన్న దివ్యాంగుల మాత్రమే అర్హులన్నారు. అనకాపల్లిలో ఎన్టీఆర్ స్టేడియంలో ఈ మెడికల్ క్యాంపు నిర్వహించబడుతుందని, ఈ కార్యక్రమంలో కొత్త పెన్షన్లు గాని, కొత్త సదరం సర్టిఫికెట్లు గాని, మంజూరు చేయబడవన్నారు. అంధత్వం(బ్లైండ్), చెవిటి, మూగ, మానసిక రోగులకు ఈ 15వేల రూపాయల పెన్షన్‌కి అర్హులు కాదని తెలియజేశారు. మెడికల్ క్యాంపులు నిర్వహించు మండలాల వారి తేదీల వారీ 17న సబ్బవరం, కే.కోటపాడు, 18న నర్సీపట్నం, పాయకరావుపేట, 19న కశింకోట, ఎలమంచిలి, 20న కోటవురట్ల, నక్కపల్లి, 21న నాతవరం, గొలుగొండ, 23న రావికమతం, రోలుగుంట, 24న దేవరాపల్లి, బుచ్చయ్యపేట, 25న ఎస్.రాయవరం, మాకవరపాలెం, 26న చీడికాడ, మాడుగుల మండలాలకు చెందినవారు పాల్గొనాలన్నారు.

సిపిఎం రక్షణ యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - చోడవరం

ఫార్మా, సెజ్‌లలో కార్మికులకు భద్రత కల్పించాలని కోరుతూ సిపిఎం చేపట్టిన రక్షణ యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు వివి.శ్రీనివాసరావు, ఎస్‌వి.నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు సిపిఎం రక్షణ యాత్ర పోస్టర్‌ను ఆ పార్టీ చోడవరం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ, యాజమాన్యాల నిర్లక్ష్యంతో ఇటీవల అచ్యుతాపురం ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో 17 మంది కార్మికులు మరణించారని, 40 మంది వరకు క్షతగాత్రులు అయ్యారని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలో వివిధ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని, దీనికోసం ప్రభుత్వాలు, యాజమాన్యాలు పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్‌తో ఈ రక్షణ యాత్ర జరుగుతోంద పేర్కొన్నారు. కార్మికులు, ప్రజలు ఈ యాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గూనూరు వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు శ్రీనివాసరావు, నాయుడు, వరలక్ష్మి తదితరులు

అభిషేక్ పాల్‌కు ఎఎంసిలో ఫ్రీ సీటు

ప్రజాశక్తి - వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామానికి చెందిన బేరా గోవిందరావు కుమారుడు అభిషేక్ పాల్‌కు ఎఎంసి (ఆంధ్రా మెడికల్ కాలేజ్)లో ఎంబిబిఎస్ ఫ్రీ సీటు సాధించాడు. నీట్‌లో 13,891 ర్యాంకు సాధించగా రాష్ట్రస్థాయిలో 667 స్టేట్ ర్యాంకు సాధించాడు. మొదట విడత కౌన్సిలింగ్‌లో విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కాలేజీలో సీట్ దక్కింది. గోవిందరావు సామాన్య మధ్యతరగతి కుటుంబానికి చెందిన వాడు. ఇతను సంతల్లో ఘరమసాల సామాన్లు అమ్ముతూ జీవనం సాగిస్తూ ఉంటాడు. తమ కుమారుడు ఎంబిబిఎస్‌లో సీటు సాధించడంతో ఎంతగానో సంతోషిస్తున్నట్లు పేర్కొన్నారు.



అభిషేక్ పాల్

ఎసెన్షియా క్షతగాత్రులకు ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎస్ఇజెడ్‌లోని ఎసెన్షియా కంపెనీలో జరిగిన ప్రమాదంలో క్షతగాత్రులకు వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన లక్ష రూపాయలు చొప్పున ఆర్థిక సాయం సోమవారం ఆ పార్టీ నాయకులు బాధితులకు అందజేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు దేశంశెట్టి శంకర్రావు, జెడ్పిటిసి సభ్యుడు లాలం రాంబాబు, పార్టీ సీనియర్ నాయకులు కోన లచ్చనాయుడు, మారిశెట్టి సూర్యనారాయణ, శరగడం జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

గెడ్డవాగు ఆక్రమణపై ఎంపీకి ఫిర్యాదు


ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని ఇరువాడ పంచాయతీ ప్రభుత్వ గెడ్డవాగు భూమిని దురాక్రమణ చేసిన ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన బలిరెడ్డి అప్పారావు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. పంచాయతీ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 103, 106లలో ఈ దురాక్రమణలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సమస్యలపై స్పందించిన ఎంపీ సిఎం. రమేష్ ప్రభుత్వ గెడ్డవాగు ఆక్రమణపై తక్షణమే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు అప్పారావు తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు ఈ విషయమై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎంపీ ఆదేశాలు పంపినట్లు తెలిపారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు

ప్రజాశక్తి-చోడవరం

జాతీయస్థాయి యోగ పోటీలకు ఎంపికైన విద్యార్థులను చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్.రాజు సోమవారం అభినందించారు. విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమిలిలో ఈ నెల 14, 15 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో చోడవరం పతంజలి శిక్షణ కేంద్రం యోగ విద్యార్థులు గెలుపొంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గొంతిన లయ వర్ధన్ రెండువ స్థానంలోనూ, పొట్నూరు పవన్ కుమార్ నాలుగో స్థానం నిలిచారు. ఈ సందర్భంగా శాసనసభ సభ్యులు కేఎస్ఎన్.రాజు మాట్లాడుతూ అలాగే వచ్చేనెల అక్టోబర్ 25, 26, 27 తేదీల్లో హిమాచల్ ప్రదేశ్‌లో జరగబోయే జాతీయస్థాయి యోగా పోటీల్లో కూడా విజయం సాధించి చోడవరానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. విజేతలను యోగా కేంద్రం చైర్మన్ పసుమర్తి అశోక్, డాక్టర్ రేపాక బంగారు కష్ణ, ఓరుగంటి రాంబాబు, ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ, యోగ టీచర్స్ బోగవిల్లి గణేష్, కొట్టాపు హరి కిరణ్, యోగా కేంద్రం సభ్యులు, స్థానిక ప్రముఖులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజు



ఇ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

23 వరకు ఇ-క్రాప్ నమోదు గడువు పెంపు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

ఈ క్రాప్ నమోదుకు వారం రోజులు గడువు పెంచుతూ వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పంట నమోదు, ఈకేవైసీ పూర్తి చేయవలసిన గడువు ఈనెల 23వ తేదీ వరకు ఉందని, ఈ అవకాశాన్ని మండలంలో రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి బి.భాస్కరరావు తెలిపారు. సోమవారం మండలంలో బుచ్చయ్యపేట, కందిపూడి తదితర గ్రామాల్లో ఈ క్రాప్ నమోదును పర్యవేక్షించారు. రైతులు వేసిన ప్రతి పంటను సంబంధిత వ్యవసాయ లేక ఉద్యాన సహాయకులను సంప్రదించి, వివరములు సమర్పించి, ఈ పంట నమోదు చేసుకోవడంతో పాటు ఈకేవైసీ కూడా చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేయబోవు వ్యవసాయ సంక్షేమ కార్యక్రమంలో ఈ పంటలో నమోదైన వివరాలను మాత్రమే ప్రాతిపదికగా ప్రభుత్వం తీసుకుంటుంది అన్నారు. ఈ క్రాఫ్ నమోదు కొరకు రైతులు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదని కేవలం 1బి కాపీ, బ్యాంకు పాసుబుక్కు కాపీ, ఆధార్ కార్డు కాపీలను సమర్పిస్తే సరిపోతుందన్నారు.

నేటి నుండి స్వచ్ఛతా హీ సేవా

ప్రజాశక్తి-కె.కోటపాడు

ఈనెల 17 నుండి 15 రోజులపాటు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.అప్పలరాజు తెలిపారు. మండలంలో ఉన్న 32 పంచాయతీల్లో కార్యక్రమాలు నిర్వహించేలా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రతిరోజు ఆయా గ్రామాల్లో మెడికల్ క్యాంపులు, ర్యాలీలు, గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఇతర జిల్లా ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

అనారోగ్యంతో టెన్త్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి -సీలేరు



మోహన్‌దాస్ (ఫైల్ ఫోటో)

జీకే.వీధి మండలం సప్పర్ల బాలుర ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గొల్లూరి మోహన్ దాస్ అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబ సభ్యుల తెలిపిన వివరాలు ప్రకారం... జికె.వీధి మండలం, జికె.వీధి పంచాయతీ పరిధి సంపంగి గొంది సమీపంలో ఉన్న ధోనిగుమ్మల గ్రామానికి చెందిన గొల్లూరి మోహన్‌దాస్ సప్పర్ల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మోహన్ దాస్‌కు జ్వరం రావడంతో నాలుగు రోజుల క్రితం స్వగ్రామం ధోనిగుమ్మలకు తీసుకెళ్లిపోయారు. ఆదివారం రాత్రి మోహన్ దాస్‌కు తీవ్ర జ్వరం రావడంతో ఆరోగ్య పరిస్థితి విషమించింది. దీంతో తల్లిదండ్రులు బంధువులు సహాయంతో జీకే.వీధి ప్రభుత్వాసుపత్రికి తరలించడానికి సిద్ధమయ్యారు. అయితే ఇటీవల వరదలకు రహదారి కొట్టుకుపోవడంతో వారి గ్రామానికి అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గత్యంతరం లేక డోలికట్టి కాలినడకన మోహన్‌దాస్‌ను రెండు కిలోమీటర్లు దూరంలోని ప్రధాన రహదారికి చేర్చారు. అక్కడ అంబులెన్సులోకి ఎక్కిస్తుండగా విద్యార్థి మోహన్‌దాస్ మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామంలోకి అంబులెన్స్ వచ్చి ఉండి ఉంటే తమ మోహన్‌దాస్‌కు వైద్య సేవలు అంది ఉండేవని స్థానికులు చెబుతున్నారు. నెల రోజులు వ్యవధిలో సప్పర్ల ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మృత్యువాత పడటంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

పరిశ్రమల పేరుతో వ్యవసాయ యోగ్యమైన

భూములను నాశనం చేయొద్దు

సిపిఎం నేతలు వెంకన్న, ముత్యాలునాయుడు

ప్రజాశక్తి-కె.కోటపాడు

పరిశ్రమల పేరుతో వ్యవసాయ యోగ్యమైన భూములను రైతుల నుండి తీసుకొని వాటిని నాశనం చేయొద్దని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి రొంగలి ముత్యాలునాయుడు డిమాండ్ చేశారు. ఎస్ఈజెడ్‌లకు భూ కేటాయింపులను రైతులు వ్యతిరేకించాలని కోరారు. ఈ మేరకు కె.కోటపాడు మండలం ఆర్లి, చింతపాలెం, గరుగుబిల్లి ప్రాంతాల్లో ఎస్ఈజెడ్‌లకు భూ కేటాయింపు ప్రాంతాలను సోమవారం సిపిఎం నాయకులు సందర్శించి పరిశీలించి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఈజెడ్‌కు కావలసిన 1012 ఎకరాల భూమి ఆర్లి, చింతపాలెం గరుగుబిల్లి రెవెన్యూ పరిధిలో ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. 602 మంది రైతుల నుండి 700 ఎకరాలు డిఫారం మెట్టు భూములు, విశాఖ స్టీల్ ప్లాంట్ (గ్రీన్ బెల్ట్)కు మొక్కల పెంపకం కోసం కేటాయించిన 300 ఎకరాలు మొత్తం 1000 ఎకరాలు పైగా భూములను ఎస్ఈజెడ్‌కు కేటాయించేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే అచ్యుతాపురం ఏరియాలో 12,500 ఎకరాలు, పరవాడ ప్రాంతంలో 2,500 ఎకారాలు భూములు ఎస్ఈజెడ్‌లకు కేటాయింపులు జరిగాయని, అక్కడ పూర్తి స్థాయిలో కంపెనీలు నిర్మాణం జరగలేదని తెలిపారు. అక్కడి మాదిరిగానే ప్రమాదకరమైన కంపెనీలు తీసుకొస్తే వాటి వ్యర్థాలను ఎక్కడకు పంపిస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.



భూ సేకరణ చేయనున్న పచ్చని పొలాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

భూములకు, వాటిల్లోని చెట్లకు నష్ట పరిహారం చెల్లించిన తరువాతే ఎస్ఈజెడ్ కోసం భూ కేటాయింపులు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తేనె పూసిన కత్తిలాంటి తియ్యని మాటలు చెబున్నారని, మరి పరవాడ ప్రాంతంలో నేటికీ ఆయన ఇచ్చిన హామీలు నెరవేరలేదని గుర్తు చేశారు. జిల్లాలోని మూతపడ్డ సుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని, గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరిస్తామని ఎంపీ సిఎం రమేష్ మాట ఇచ్చారని, మరి ఆ మాటను ఎందుకు నేరవేర్చడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే, ఎంపీ మాటలను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. ఇప్పటికే పరవాడ, అచ్యుతాపురం సెజ్‌ల్లో జరిగే ప్రమాదాలు, అక్కడి స్థానికులకు ఉపాధి ఇవ్వకుండా ఎలా మోసం చేస్తున్నారో చూస్తున్నామని, ఇక్కడ కూడా అదే పరిస్థితి ఏర్పడుతుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు ఎస్ఇజెడ్‌కు అనుమతి ఇవ్వొదని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఇ నాయుడుబాబు, రైతు సంఘం మండల కార్యదర్శి వి.సూర్యనారాయణ, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జి.ప్రసాద్, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎంపీకి వినతి



ఎంపీ రమేష్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - అనకాపల్లి

మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యాన అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ కార్మికులకు గుత్తేదారులు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని, వేతనాలు ఎప్పుడు ఇస్తారని అడిగితే బిల్లులు రాలేదని సాకులు చెబుతున్నారని పేర్కొన్నారు. దుర్భర పరిస్థితుల్లో వైద్య విభాగ ఒప్పంద కార్మికులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తక్షణం ప్రభుత్వం స్పందించి గుత్తేదారు వ్యవస్థను రద్దు చేయాలని, పురపాలక కార్మికుల తరహాలో ఆప్కాస్లో కలపాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, యూనిఫామ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు పరిష్కారం చేయకుంటే ఈ నెల 30 నుంచి సమ్మెలోకి వెళు తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కిరణ్, సుధీర్, వడ్డాది ఈశ్వరరావు, వినోద్ కుమార్, విజయ్, వరలక్ష్మి పాల్గొన్నారు.

19 నుంచి మండల స్థాయి పోటీలు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈనెల 19వ తేదీ నుంచి మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించబడతాయని స్కూల్ గేమ్ ఫెడరేషన్ మండల కోఆర్డినేటర్ ఎస్వి.నరసింహం సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అండర్ 14 అండ్ 17 బాల, బాలికలకు వేర్వేరుగా ఈనెల 19న ఖోఖో, యోగ పోటీలు చెస్ జీవీఎంసీ గవరపాలెం హై స్కూల్లో, అలాగే 20న వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ (బాలికలు) జీవీఎంసీ హై స్కూల్ మెయిన్లో, 21న అథ్లెటిక్స్, షెటిల్, బ్యాడ్మింటన్ (బాలురు) ఎన్‌టిఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని యాజమాన్య పాఠశాలలకు చెందిన విద్యార్థులు అండర్ 14 (1.1.2011 తరువాత పుట్టిన వారు), 17 (1.1.2008 తర్వాత పుట్టిన వారు) అర్హులన్నారు. పై అంశాల్లో పాల్గొనే వారు విద్యార్హత అర్హత పత్రాలతో మధ్యాహ్న భోజన పథకం ఎక్విటెన్స్ లతో ఆయా తేదీల్లో ఆయా పాఠశాలల్లో హాజరుకావాలని తెలిపారు. ఇతర వివరాలకు 9247150037 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

భారీ వర్షాలకు ధ్వంసమైన

పంటలు, ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలి

సిపిఎం ఎంపిటిసి సభ్యులు బుజ్జిబాబు

ప్రజాశక్తి -సీలేరు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జీకే వీధి మండలంలో పంట పొలాలు, ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని, వాటికి నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి, గాలికొండ ఎంపీటీసీ అపరంజి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. గుమ్మరేవుల పంచాయతీ మాదిగ మల్లు గ్రామంలో బాధితులతో సోమవారం ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు మాట్లాడి, వారికి జరిగిన నష్టంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుజ్జిబాబు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తక్షణమే అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఓ పిఓ అభిషేక్, ఇతర శాఖల అధికారులు గుమ్మి రేవులు, దారకొండ, దుప్పిలివాడ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని కోరారు. మాదిగ మల్లు, అన్నవరం గ్రామాల్లో నాలుగు కుటుంబాలకు చెందిన ఇల్లు పూర్తిగా వరదలకు కొట్టుకుపోయి ఆనవాళ్ళు లేకుండా పోయాయని, కట్టు బట్టలతో వారు మిగిలారని పేర్కొన్నారు. వరద విపత్తు వచ్చి ఏడు రోజులు గడుస్తున్నా పంటలు, పశునష్టాన్ని అంచనా వేయలేదన్నారు. రైతులు ఎంతో కష్టపడి ఓరి సామలు, రాగులు ఇతర దినుసు పంటలు వేసుకుంటే వరదలో పంటలు పూర్తిగా కొట్టుకుపోయి, ఆ భూములు పూర్తిగా బండ రాళ్లు మట్టి దెబ్బలతో పేరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరదల్లో నష్టపోయిన గిరిజన రైతులకు ఈక్రాప్ నమోదు చేసుకుంటేనే నష్టపరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పడం సమంజసం కాదన్నారు. ఈ క్రాప్‌తో సంబంధం లేకుండా పంట నష్టపోయిన ప్రతి రైతుకీ పరిహారం ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. మాదిగ మల్లు బాధితులకు నిత్యవసర సరుకులు అందజేయాలని, సచివాలయ వీఆర్వోల ద్వారా పంట నష్టం సర్వే చేయడం వలన ఎటువంటి ఉపయోగం లేదని, కలెక్టర్, ఐటిడిఎ పీవో స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను తక్షణమే ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



మాదిగమల్లులో వరద బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం ఎంపీటీసీ బుజ్జిబాబు

మరుగుదొడ్లు లేక వెతలు

ఇదీ తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది దుస్థితి


మూత్రం పోస్తున్న వ్యక్తి

ప్రజాశక్తి- కోటవురట్ల:మండలానికి దిశా నిర్దేశం చేసి ప్రజల సమస్యలను మండల సమస్యలను పరిష్కరించే మండల మెజిస్ట్రేట్ తహసిల్దార్ కార్యాలయంకు మరుగుదొడ్లు లేకపోవడంతో సిబ్బంది, కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర అవస్థలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యాలయం నిర్మించి సుమారు నాలుగు దశాబ్దాలు పూర్తయ్యింది. కార్యాలయం తొలినాళ్లలో నిర్మించిన మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆనాడు మరుగుదొడ్లు నిర్మించారు. కానీ రన్నింగ్ వాటర్ లేక పోవడంతో నిరుపయోగంగా పడి ఉండేవి. ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది, ప్రధానంగా కార్యాలయానికి వచ్చే వృద్ధులు, మహిళలు, మహిళా సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్నత స్థాయి అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కార్యాలయానికి మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుకుంటున్నారు.


కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన కుర్చీ

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మార్పులు

ప్రజాశక్తి-కోటవురట్ల: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాల యంలో మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నాయి. గతంలో కార్యాలయం రిజిస్ట్రార్‌కు ఉండే ప్రత్యేక ఛాంబర్ ను ఎత్తయిన కుర్చీని తొలగించారు. సాధారణ పరిపాలన అధికారిగా అన్ని ప్రభుత్వ కార్యాలయ అధికారులు మాదిరిగా కూర్చునే విధంగానే ప్రభుత్వ ఆదేశాల మేరకు రిజిస్టర్ అధికారికి ఏర్పాట్లు చేశారు. గతంలో రిజిస్టర్ వద్ద క్రయవిక్రయాలు జరిగే సమయంలో నిలుచుని మాట్లాడవలసి వచ్చేది. ప్రస్తుతం దానికి స్వస్తి పలికి రిజిస్టర్ అధికారి ఎదురుగా కూర్చుని స్నేహపూర్వక వాతావరణంలో అధికారి అందుబాటులో ఉంటారని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

30 నుంచి సమ్మె చేపడతాం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: జిల్లాలో వైద్య విభాగంలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికుల సమస్యల పరిష్కారంపై ఈనెల 30 వ తేదీ నుండి సమ్మె చేస్తామని, ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్లు, శాసనసభ్యులు, ఎంపీలకు వినతి పత్రాలు ఇస్తామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు యల్.వి. రమణ సోమవారం విలేకరులకు తెలిపారు.ఏ రియా ఆసుపత్రి వద్ద వైద్య విభాగ ఒప్పంద కార్మికుల సంఘం అధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, కార్మికులకు గుత్తేదారులు సకాలంలో జీతాలు ఇవ్వలేదన్నారు. వేతనాలు ఎప్పుడు ఇస్తారని అడిగితే బిల్లులు రాలేదని, అందుకే ఇవ్వలేదని సాకులు చెబుతున్నారని పేర్కొన్నారు. దుర్భర పరిస్థితుల్లో వైద్య విభాగ ఒప్పంద కార్మికులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తక్షణం ప్రభుత్వం స్పందించి ఒప్పంద కార్మికులకు సంబంధించి గుత్తేదారు వ్యవస్థను రద్దు చేయాలని, పురపాలక కార్మికుల తరహాలో ఆప్కాస్ లో కలపాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెదపూడి సత్యవతి, సోమేశ్వరరావు, పార్వతి, దుర్గా, లక్ష్మి, రాము, పద్మ, మల్లేశ్వరి, కమల, వరలక్ష్మి, లావణ్య, దేవి పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న కార్మికులు

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ


నక్కపల్లిలో ర్యాలీ చేపడుతున్న ముస్లిములు

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్:జిల్లా సీరత్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో సోమవారం ముస్లింలు శాంతి యాత్ర చేపట్టారు. మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలను పఠిస్తూ వివిధ మసీదుల నుంచి వచ్చిన మౌల్వీలు, ఇమామ్లు, జమాత్ సభ్యులు, యూత్ అసోసియేషన్లు, మదరసా బాలికలు హిందూ, ముస్లింలతో కలిసి శాంతి ర్యాలీ చేశారు. ఈ ర్యాలీ ప్రభుత్వ మహిళా కళాశాల (పాత జైలు రోడ్డు) నుంచి బయలుదేరి, రెడ్నం గార్డెన్స్,సెవన్ హిల్స్, జగదాంబ జంక్షన్ మెయిన్ రోడ్డు, పూర్ణామార్కెట్ మీదుగా సాగింది. శాంతి యాత్ర హజరత్ ఇషాక్ మదిని బెలియా అలైహి దర్గా మీదుగా సెయింట్ అలాయిసిస్ స్కూలు ఆవరణ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా మత పెద్దలు మౌలానా మాట్లాడుతూ, మహమ్మద్ ప్రవక్త విశ్వ ప్రవక్త అని, సమస్త మానవ జాతికి మార్గదర్శి అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అబ్దుల్ లతీఫ్, కోశాధికారి ముస్తాబ్ అహ్మద్, అహ్మద్ వలి, షేక్ ఇస్మాయిల్, హైదర్ అలీ సింఖా,మునీర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

ఆవాజ్ కమిటీ బ్యానర్ ప్రదర్శన

ఈ ప్రదర్శనలో భాగంగా ఆవాజ్ కమిటీ సభ్యులు వక్ఫ్ చట్టంలో చేసిన సవరణల ప్రతిపాదనలో ఉన్న లోటుపాట్లను తెలియజేస్తూ ప్రత్యేక బ్యానర్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ మేరకు కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.ఎ అశ్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 53వ వార్డు పరిధి జాకీర్ హుస్సేన్ నగర్ మస్జిద్ - ఈ - అల్ ఖదీర్ ఆధ్వర్యాన ఈద్ మిలద్ ఉన్ నబీ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఫజర్ నమాజ్‌ను ఆచరించిన ముస్లిం సోదరులు ఖురాన్ పఠించారు. చిన్నారులు నాతే కలం ఆలపిస్తూ నగరంలో పలు మసీదుల నుంచి నిర్వహించిన శాంతి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కోటవీధి ఇషాక్ మదీనా వలి దర్గా వద్దకు చేరుకుని చదర్ (పవిత్రవస్త్రం) సమర్పించి దావత్ నిర్వహించారు. కార్యక్రమాన్ని మస్జిద్ కమిటీ అధ్యక్షులు మున్నా పర్యవేక్షించారు.

నర్సీపట్నం టౌన్: మిలాద్ ఉన్ నబి వేడుకల సందర్భంగా నర్సీపట్నంలో ముస్లిం సోదరులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కృష్ణబజార్ మసీదు వద్ద నుంచి పెద్ద బొడ్డేపల్లి మసీదు వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మసీదులో ప్రార్థన నిర్వహించారు.

నక్కపల్లి:మండలంలోని ముస్లిం గ్రామాల్లో సోమవారం ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని మత పెద్దలు ఆధ్వర్యంలో శాంతికి చిహ్నంగా జెండాలను చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. నక్కపల్లిలో జెండా పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. మిలాద్ ఉన్ నబి వేడుకలను పురస్కరించుకొని ముస్లిం గ్రామాల్లో సందడి నెలకొంది. ఈ వేడుకల్లో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ముస్లిం మత పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విశాఖలో ర్యాలీ చేపడుతున్న ముస్లిములు

అనకాపల్లి : పట్టణంలో జామియా మసీద్ ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబీ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణంలో భారీ ర్యాలీని నిర్వహించారు. టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జామియా మసీద్ ప్రెసిడెంట్ లాయర్ హుస్సేన్ సురేంద్రను దుస్సాలవాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఖాజి రెహ్మాన్ షరీఫ్, షేక్ జిలాని, షేక్ ఉమర్, షేక్ నిజం, షేక్ రియాజ్, బడా బాబు, షేక్ ఖాదర్, రషీద్ భాయ్ పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని కశింకోట నూరిమసీదు, అబుల్ అజిషా ఖాదరి దర్గా, బయ్యవరం ఆన్సర్ మదిని ఔలియా దర్గాలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. కశింకోట, బయ్యవరం గ్రామంలో ముస్లిం కుటుంబ సభ్యులు ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో ముస్లిం మత పెద్దలు, టిడిపి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్.కె.బాబర్, అబ్దుల్ కలాం ఆజాద్, మౌలానా నసీం, మక్బూల్, మౌలానా జాఫర్, ఎస్‌కే బుఖారి, సయ్యద్ సలీం పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న నాయకులు

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని సీతంపాలెం గ్రామంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ముగ్గుల ఫోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసారు.గ్రామానికి చెందిన అల్లు సింహాద్రి జ్ఞాపకార్థం ఏ ఎస్ డి స్టార్ బాయ్స్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. నాయకులు గొర్ల నాగ అప్పలరాజు, గోవింద్, పెద్దల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మ కమలం

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలోని ఓ ఇంటి వద్ద బ్రహ్మ కమలం పుష్పం వికసించింది. ఇంటి యజమాని దేవి మాట్లాడుతూ, సోమవారం తెల్లవారుజామున బ్రహ్మ కమలం పుష్పం వికసించిందని ఆనందం వ్యక్తం చేసింది .పలువురు బ్రహ్మ కమలం పుష్పం ను చూసేందుకు తరలి వచ్చారు .


బ్రహ్మ కమలం పుష్పం

ఎస్ఐ రమేష్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -కోటవురట్ల:కోటవురట్ల ఎస్సైగా సోమవారం ఎస్.రమేష్ బాధ్యతలు చేపట్టారు. ఆయన అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన రమణయ్య అనకాపల్లికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై రమేష్ మాట్లాడుతూ, శాంతి భద్రత పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపుతానని తెలిపారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.




ఆవేదన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

కలుషిత ఆహార బాధితులకు పరిహారం ఏదీ?

ప్రజాశక్తి -హుకుంపేట:పరిహారం అందించాలని కలుషిత ఆహార బాధిత విద్యార్థులు తల్లిదండ్రులు కోరారు. వారి కథనం మేరకు... కోటవురట్లలోని అనాథ ఆశ్రమంలో ఫుడ్ పాయిజన్ జరిగిన విషయం విజేతమే. ఈ ఆశ్రమ పాఠశాలలో ఉండి అల్లూరి జిల్లా హుకుంపేట మండలం తీగల వలస పంచాయతీకి చెందిన పిల్లలు పాంగి.అభిషేక్ (9.వ తరగతి) పాంగి సౌజన్య ఎం పి హెచ్ డబ్ల్యు (ఇంటర్ ద్వితీయ సంవత్సరం) కిల్లో సంజయ్ తేజ (6.వ తరగతి) పాంగి. వంశీ (4వ తరగతి) చదివారు. కలుషిత ఆహారం ఘటన తర్వాత గరుడాపల్లి, అమూరు గ్రామాల చెందిన విద్యార్థులను తల్లిదండ్రులు తీసుకుని వచ్చారు. పాడేరు ఏరియా ఆసుపత్రిలో మూడు రోజుల పాటు వైద్యం పొందారు. అనంతరం గ్రామానికి చేరుకున్నారు. నష్టపరిహారం అందకపోవడంతో ఈనెల 9న కలెక్టర్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం మీడియా ముందుకు సోమవారం విద్యార్థులు తల్లిదండ్రులు వచ్చి తమ ఆవేదను వెలిబుచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం చెల్లించి తమను ఆదుకోవాలనితల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

వేతన బకాయిలు చెల్లించాలి

క్లాప్ ఆటో డ్రైవర్స్, లోడర్స్ కార్మికుల నిరసన -బంద్‌తో ఎక్కడికక్కడ నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: తడి -పొడి చెత్త సేకరించే జివిఎంసి క్లాప్ ఆటోలను యార్డ్ నుండి బయటికి కదలకుండా ఆయా జోన్లలో సోమవారం బంద్ చేశారు. కాప్ ఆటో డ్రైవర్స్, లోడర్స్ కార్మికుల జీతాలు చెల్లించాలని నగరంలో ధర్నాలు నిర్వహించారు. ఆరు నెలల నుండి నాలుగు నెలలు జీతాలు ఇవ్వకపోతే పిల్లలతో ఎలా బతుకేది అని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, బకాయి ఉన్న నాలుగు నెలల జీతాలు తక్షణం చెల్లించాలని, రోజువారి వేతనం ఎంత అన్నది తెలియని బానిసలు గా కార్మికులు ఉన్నారన్నారు. ఈఎస్ఐ, పిఎఫ్ చెల్లించడం లేదన్నారు. కార్మికులకు ఇచ్చే జీతం, ఇతర ప్రయోజనాల గురించి అడిగితే, ఏ ఒక్క అధికారి ఉన్నది సమాధానం ఇవ్వలేదని నాయకులు విమర్శించారు. ఇందుకు బాధ్యులైన కాంట్రాక్టర్ పై జివిఎంసి కమిషనర్ చర్యలు తీసుకోవాలని లేదంటే కాంట్రాక్టర్ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే జీతాలు చెల్లించాలని, లేదంటే ఈ బంద్ కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు అనిల్, ప్రధాన కార్యదర్శి ఎల్ల బెల్లి సుదీర్, జెక్కి లక్ష్మి, రాజు, ధనరాజ్, వీర్రాజు, జి వి ఎం సి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గాజువాక జోన్ కమిటీ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న కార్మికులు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్‌డిఒ జయరాం

ఓజోన్‌ను పరిరక్షించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గ్రీన్ క్లబ్ నర్సీపట్నం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఆర్డిఓ జయరాం గ్రీన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డి గోపీనాథ్ సోమవారం ప్రారంభించారు. నర్సీపట్నం ఆర్డిఓ కార్యాలయం నుండి బొడ్డేపల్లి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఓజోన్‌ను ఆవశ్యకతను తెలియజేసి దాని పరిరక్షణకు అందరూ పాటుపడాలని వారు సూచించారు. గోపీనాథ్ ఆధ్వర్యంలో ఇటీవల మట్టి వినాయకులను పంపిణీ చేయడం, ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని జరపడం సంతోషదాయకమని ఆర్డిఓ జయరాం తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు పలువురు చూపిస్తున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. ఓజోన్ పరిరక్షణ అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ప్రథమ, ద్వితీయ, కన్సోలేషన్ ప్రైజ్‌లను సీనియర్, జూనియర్ విభాగాలలో ఇచ్చారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణ, ఓజోన్ సంరక్షణ అంటూ నినాదాలతో హోరెత్తించారు. పలు ప్రాంతాల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ఏ. రమణమూర్తి, అప్పారావు, బివి నాయుడు, బంగారు అప్పలనాయుడు, వరహాల నాయుడు, జీ.వి రమేష్, బాబీ మాస్టారు, తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఐని అభినందిస్తున్న నాయకులు

ఎస్ఐకి అభినందనలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో కేడీపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన టి.దివ్యకు ఎంపీపీ గజ్జలపు మాణికుమారి, వైసిపి నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, స్టేషన్‌కు మహిళా ఎస్ఐ రావడం ఇదే తొలిసారని, మహిళల సమస్యలు సత్వరం పరిష్కారం కావడానికి ఆస్కారం ఉంటుందన్నారు.

గ్రామ వాలంటీర్లను కొనసాగించాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: గ్రామ వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు బి విజయ్ కోరారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించి పది వేల వేతనం పెంచుతామని హామీ ఇచ్చారని చెప్పారు. సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టి వాలంటీర్లను విధుల్లో తీసుకోవాలని చెప్పారు. ఇటీవల సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ గ్రామ వాలంటీర్ల వ్యవస్థను రద్దు చేసి వారికిచ్చే గౌరవ వేతనంను సర్పంచులు ఎంపిటిసిలకు ఇవ్వాలని ప్రకటించడంపై తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. వాలంటీర్లను కొనసాగిస్తే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ ఫలాలను ప్రజల చెంతకు చేరే విధంగా కృషి చేస్తామని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఉత్సాహంగా దసరా పండుగ జరుపుకునేందుకు ప్రత్యేక వస్త్రాలు కోసం, రాబోయే వివాహాల సీజన్ కోసం అద్భుతమైన భారతీయత ఉట్టిపడే సంప్రదాయ వస్త్రాలు పొందాలనుకునే వారి కోసం, అందరి అభిరుచులను తీర్చేందుకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో - ఎగ్జిబిషన్ కమ్ సేల్ నగరంలో ప్రారంభమైంది. ఈ ప్రదర్శన, అమ్మకాల ప్రదర్శన ఈ నెల 22 వరకు హోటల్ గ్రీన్ పార్క్‌లో నిర్వహిస్తున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విభిన్న సంస్కృతులు కలబోసిన వేర్వేరు రాష్ట్రాలకు చెందిన నేతన్నల మగ్గం ఉత్పత్తులు అన్నీ ఒకేచోట లభిస్తాయని నిర్వాహకులు మీడియాకు తెలిపారు. దేశం నలుమూలల నుండి తమ విశిష్ట ఉత్పత్తులతో నేత కార్మికులు అందరు ఒకేచోట కావలసిన వస్త్రాలు అందిస్తారని, వేలాది రకాల సిల్క్, కాటన్ డిజైన్ వస్త్రాలను, డిజైనర్ బ్లౌజులు, కుర్తీలు మొదలైన వాటిని 50 శాతం వరకు తగ్గింపు ధరలకు ఒకేచోట లభిస్తాయని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 11 నుండి రాత్రి 9 గంటలు వరకు ప్రదర్శన ఉంటుందని, ప్రవేశం ఉచితం అన్నారు. అన్ని డెబిట్, క్రెడిట్ కార్డులు స్వీకరించబడతాయని నిర్వాహకులు తెలిపారు.


చీరలు చూపుతున్న నిర్వాహకులు

జిఒ 115 రద్దు చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: జివో 115తో తమకు అన్యాయం జరుగుతుందని, దానిని రద్దు చేయాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం విక్టోరియా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వానికి విన్నవించినా న్యాయం చేయలేదన్నారు. 13 ఏళ్లగా రెగ్యులర్ నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. రెగ్యులర్ నోటిఫికేషన్ ఇచ్చి కాంట్రాక్ట్‌లో ఉన్న వారందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. తమ విధులకు ఇప్పటివరకు ఎటువంటి ఆటంకం కలిగించకుండా శాంతి యుతంగా నిరసనలు చేపడుతున్నామని చెప్పారు.


ఆందోళన చేస్తున్న బాధితులు

ఉపాధి కల్పించాలని ఆందోళన

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలోని సీతగుంట పంచాయతీ లాకేపుట్టు గ్రామంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఏకలవ్య పాఠశాలకు భూములిచ్చిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆందోళన చేపట్టారు. ఈ మేరకు సోమవారం లకేపుట్టు గ్రామంలో 8 బాధిత కుటుంబాలు ప్రభుత్వానికి తమ ఆవేదనను వెలిబుచ్చారు. ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి గత ప్రభుత్వం లాకేపుట్టు గ్రామస్తుల వద్ద నుండి 13 ఎకరాలు సేకరించి ఉద్యోగ ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చి నేటికీ హామీ నెరవేర్చలేదని బాధిత కుటుంబాలు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

విద్యార్థుల మరణాలపై విచారణ చేపట్టాలి

ఎస్ఎఫ్ఐ నేతల డిమాండ్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా జికె.వీధి మండలం సప్పర్ల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న టెన్త్ విద్యార్థి గొల్లూరి మోహన్ దాస్ (15) తన స్వగ్రామంలో అనారోగ్యంతో మరణించాడని, ఆర్.వి నగర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న జంపరంగి దార మల్లేశ్వరి వైజాగ్ కేజీహెచ్ లో చికిత్స పొందుతూ మరణించిందని, ఈ మరణాలపై విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్ శ్రీను, జీవన్ కృష్ణలు స్థానిక విలేకరులకు సోమవారం తెలిపారు. వైద్య సేవలు అందక విద్యార్థులు మృతి చెందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఐటీడీఎ అధికారులు విద్యార్థుల మరణాలపై బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వెంటనే విద్యార్థుల కుటుంబానికి ఎక్స్ గ్రేషియా రూ.25 లక్షల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. మెను ప్రకారంగా భోజనం పెట్టకపోవడం, ఉడికి ఉడకని అన్నం పెట్టడం, రాష్ట్ర ప్రభుత్వం వైద్య శిబిరాన్ని నియమించకపోవడం, పిల్లలు తీసుకునే ఆహారంలో సరైన పౌష్టిక క్యాలరీస్ లేకపోవడం తదితర కారణాలతో విద్యార్థులు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల మరణాలపై విచారణ జరిపించి, కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే వసతి గృహాల్లో వర్కర్స్, హెల్త్ అసిస్టెంట్లను, వాచ్మెన్లను నియమించాలన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి విద్యార్థుల మరణాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సింహాద్రి, చిన్నారావు, గోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు